# సమస్యలపై స్పందించకుంటే 5 నుంచి ఉద్యమ బాట

**సెకండ్ ఏఎన్ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి**

**ఏఐటీయూసీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్**

**తాసిల్దార్ కార్యాలయం ముందు ఏఎన్ఎంల నిరసన**



మక్తల్ సెప్టెంబరు 26 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం విధులు నిర్వర్తిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సెకండ్ ఏఎన్ఎంల కు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ , రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఏఎన్ఎం యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఇచ్చిన మూడు రోజుల నిరసనల పిలుపుమేరకు మంగళవారం నాడు నారాయణపేట జిల్లా మక్తల్ మండలం తాహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి ఉప తాహసిల్దార్ పుష్పలత గారికి ,మరియు కర్ని గ్రామ పీ హెచ్ సీ కేంద్రం ముందు నిరసన వ్యక్తం చేసి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విరోజా గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న మాట్లాడుతూ.. గత 25 30 సంవత్సరాలుగా 3 వేల రూపాయల వేతనం నుంచి కట్టుబానిసల్లా వెట్టిచాకిరి చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని , దశాబ్దాలు గడుస్తున్నా శ్రమదోపిడికి గురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య తీరు సరైంది కాదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని మొత్తం రెగ్యులరైజ్ చేస్తానని , అసలు కాంట్రాక్టు వ్యవస్థనే లేకుండా చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట నీటి మూటలా మారిందని కొండన్న విమర్శించారు. కోవిడ్ మహమ్మారి కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విశిష్టమైన సేవలు అందించిన వైద్య ఆరోగ్య సిబ్బంది అయిన ఏఎన్ఎం లను పూల వాన కురిపించి వట్టి మాటలతో మాయ చేసి, ఏఎన్ఎంల చెవిలో పువ్వులు పెట్టారని ఆయన ఎద్దేవ చేశారు.

సెకండ్ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని గత సంవత్సర కాలంగా అనేక రూపాల్లో ఆందోళనలు , పోరాటాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో ఆగస్టు 16 నుంచి సమ్మెబాట పట్టారని , రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకు దిగి వచ్చి ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం కొరకు ఐఏఎస్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని వేస్తామని , కమిటీ ద్వారా సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని సెప్టెంబర్ 4న సమ్మె విరమణ కోసం ఏఎన్ఎంల యూనియన్ కు విజ్ఞప్తి చేయగా, సెకండ్ ఏఎన్ఎంలు సమ్మె తాత్కాలిక వాయిదాకి అంగీకరించి , ప్రభుత్వ మాట , తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ గడల శ్రీనివాసులు గార్లు ఇచ్చిన హామీతో సెప్టెంబరు నాలుగున 20 రోజులుగా సాగుతున్న సమ్మెకు తాత్కాలిక వాయిదా వేయడం జరిగిందని కొండన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేసి 20 రోజులు గడుస్తున్నా కనీసం ఒక్క సమావేశం పెట్టకుండా యూనియన్ ల రిప్రజెంటేషన్ తీసుకోకుండా నాన్చుడు ధోరణిని ప్రదర్శిస్తున్నదని ఆయన ఆరోపించారు. తద్వారా కేసీఆర్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రెగ్యులరైజేషన్ మాటలాగే ఏఎన్ఎం లకు ఇచ్చిన ఈ మాట కూడా నీటి మూటలా మారకూడదని కొండన్న హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన త్రిసభ్య కమిటీ వేగవంతంగా పనిచేయాలని నిర్లక్ష్య ధోరణిని అనుసరిస్తున్నందువలన సెకండ్ ఏఎన్ఎం యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మండల తాసిల్దార్ కార్యాలయాల ముందు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పీహెచ్ సి ఎదుట ఆందోళనలు చేసి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎంలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సెకండ్ ఏఎన్ఎం ల దీర్ఘకాలిక డిమాండ్ అయిన బేషరతుగా రెగ్యులరైజేషన్ హక్కుని అమలుచేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రావిడెంట్ ఫండ్ పీఎఫ్. ఈఎస్ఐ,హెల్త్ కార్డులు మెటర్నిటీ సెలవులతో పాటు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వర్తించే సంవత్సరీక సెలవులను వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తోపాటు కోవిడ్ కరోనా సమయపు 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కొనసాగించాలని, సహజ మరణానికి 10 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ శ్రామిక హక్కులను ఏఎన్ఎంలకు అమలు చేయాలని కొండన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఏఎన్ఎం యూనియన్ నాయకులు డి వెంకటేశ్వరమ్మ, చంద్రకళ మునెమ్మ, శివ లీల, లలిత, శశికళ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## భారత జాగృతి ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు




కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26 (వాయిస్ టుడే): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని మర్కల్ సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా లోని వివిధ కళాశాలల విద్యార్థినులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చట్ట సభల్లో మహిళా రెసర్వేషన్ బిల్లు ఆమోదంపై భారత జాగృతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల విద్యార్థినులు పాల్గొని ప్రసంగించారు. ఉపన్యాసం లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థినులు చట్ట సభల్లో రిజర్వేషన్ బిల్లు ఆమోదం పట్ల కలిగే ప్రయోజనాలు, మహిళల ప్రాధాన్యంపై ఉపన్యసించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఇందులో మొదటి బహుమతి మానస (మర్కల్ డిగ్రీ కాలేజ్ ) రెండవ బహుమతి ప్రత్యూష (మర్కల్ డిగ్రీ కాలేజ్ )మూడవ బహుమతి మెహర్ జబీన్ లు గెలుపొందారు. అలాగే మరో రెండు కన్సోలేషన్ బహుమతులును వైష్ణవి, సానియా మహీన్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు అనంత రాములు, మహిళా అధ్యక్షురాలు బట్టు పద్మజా, జాగృతి సభ్యులు శ్రీరామ్ వెంకటేష్, కులకర్ణి చక్రధర్, సత్యనారాయణ, రాజు, న్యాయవాదులు ప్రియాంక, శభానా, సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. రాధిక, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో ఘనంగా చాకలి ఐలమ్మ 128 వ జయంతి వేడుకలు



జమ్మికుంట (వాయిస్ టుడే): చాకలి ఐలమ్మ 128జయంతినీ పురస్కరించుకుని జమ్మికుంట రజక సంఘం వరంగంటి సదనాందం అధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, సింగిల్ విండో చైర్మన్ పొన్నగంటి సంపత్, కౌన్సిలర్ పొనగంటి సారంగం మరియు రజక సంఘం నాయకులు రాచమల్ల రవి, బూరుగుపల్లి రాము, పూసల శ్రీనివాస్, ముప్పు రాయబోసు, పసుపునుటి శివ, చానకొండ శ్రీనివాస్ రావు, అంజి రావు, రావుల రాజేందర్, శ్రీనివాస్ రావుల సంపత్, మెరుపురి సారయ్య, కైలాసటి సమ్మయ్య, పసునూటి ఐలయ్య, బూరుగుపల్లి నాగరాజు, కొలురి కుమార్, సదానందం, మహేందర్, సదానందం, సందీప్, రామ్ చందర్ రజక నాయకులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో మంగళ వారము రోజున చాకలి ఐలమ్మ 128వ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళు లర్పించారు.. ఈ సందర్భంగా సర్పంచ్ సామల? లావణ్య వేణు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిల్చిన అగ్నికణం ఐలమ్మ అని అన్నారు.. ఈ కార్యక్రమంలో నాయకులు కాటిపల్లి గంగారెడ్డి, మాజీ సర్పంచులు మరిపెల్లి నారాయణ గౌడ్, నీరటిశ్రీనివాస్, ఆదిరెడ్డి, కొల్లూరు వేణు, పోతవేణి రాజేందర్, వార్డు సభ్యులు అనంతస్వామి, ముత్తన్న, లక్ష్మయ్య, కొక్కు శేఖర్, కనపర్తి శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షులు మాదాసు లక్ష్మీనరసయ్య ఓరగంటి కిషన్ మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కోసం సమిష్టిగా పోరాడుదాం

**ప్రజలు ప్రభుత్వ వారధుల పట్ల వివక్షత వీడాలి**

**అర్హులైన జర్నలిస్టులకు తక్షణమే ఇంటి స్థలాలు మంజూరు చేయాలి**

**దశలవారి ఆందోళనలకు జర్నలిస్టులు సిద్ధం కావాలి**

**ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించేవరకు జర్నలిస్టులకు అండగా ఉంటాం**

**– రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**



కొత్తగూడెం/వాయిస్ టుడే : ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఏండ్లు గడుస్తున్నా జర్నలిస్టులకు నీడకల్పించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శేషగిరిభవన్లో మంగళవారం జరిగిన వామపక్షాలు, విపక్ష పార్టీలు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా, సామాజిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతీ వేదికపై జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ గుప్పిస్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని, ఇటీవల జిల్లా పర్యటన సందర్భంగా ఇక్కడి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా అతీగతి లేకుండా పోయిందన్నారు. జర్నలిస్టులతో పనిలేకుండా పత్రికలు ఛానళ్ళ యాజమాన్యాలను గుప్పెట్లో పెట్టుకుంటే సరిపోతుందనే ఆలోచనలో కేసీఆర్ ఉండటం వల్లే వారి సమస్యల పట్ల స్పందించడం లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడుతూ జర్నలిస్టుల పక్షాన ఎమ్మెల్యేలు, ఎంపీలు కేసీఆర్ ను నిలదీసే దమ్ము ధైర్యం లేకపోవడం వల్లే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యకు పరిష్కారం లభించడం లేదన్నారు. తొమ్మిదిన్నరేండ్లుగా జర్నలిస్టులను మభ్యపెడుతూ కాలం వెల్లదీస్తున్నారని, చిత్తశుద్ధితో స్థలాలు ఇవ్వాలనే ఆలోచ ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోందన్నారు. కొత్తగూడెం పట్టణంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికి మంజూరు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, జర్నలిస్టులు పేదవారు కాదా అని ప్రశ్నించారు. ఈ పరిస్థితిలో సమిష్టిపోరాటాలే శరణ్యమని, జర్నలిస్టుల పక్షాన ప్రభుత్వం పోరాడేందుకు వామపక్షాలు, విపక్షాలుగా సిద్ధంగా ఉన్నామని, ఉద్యమ భాధ్యతను తామే మోస్తామని పునరుద్ఘాటించారు. మరోసారి సమావేశమై పోరాట కార్యాచరణను రూపొందించి ప్రత్యక్ష ఆందోలనలకు పూనుకుంటామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ, ప్రజా సంఘాల జిల్లా నాయకులు బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, వై.శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్, గుత్తుల సత్యనారాయణ, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, లిక్కి బాలరాజు, నూనావత్ గోవిందు, ఎస్ కె. ఫహీమ్, కె.తర్నకుమారి, గోనె మణి, బోయిన విజయ్ కుమార్, మాచర్ల శ్రీనివాస్, పి. సత్యనారాయణచారి, గొనె సురేష్, షమీమ్, విజయలక్ష్మి, జర్నలిస్టు సంఘాల నాయకులు ఉమంది ఉదయ్ కుమార్, జి.వెంకటేశ్వర్లు, పోలిశెట్టి రమేష్, సూరి, శివకుమారస్వామి, కుమార్, దశరద్, అప్పారావు, సుధాకర్రావు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ స్థలాలు పరిరక్షించడంలో పాలనా యంత్రాంగం విఫలం

**స్పందించకుంటే భూ కబ్జాదారుల నుంచి ప్రభుత్వ ఆస్తులను కాపాడుకుంటాం**


**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా**

కొత్తగూడెం/వాయిస్ టుడే : కోట్లాది రూపాయల విలువసే ప్రభుత్వ భూములు, సింగరేణి లీజు స్థలాలు, రెవిన్యూ భూములు కబ్జాకు గురవుతుంటే అధికార యంత్రాంగం మొద్దు నిద్ర నటిస్తోందని, అధికారుల తీరు పలు అనుమానాలకు తావిస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. స్థానిక శేషగిరిభవన్లో మంగళవారం జరిగిన సిపిఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండ్లు లేని పేద వర్గాలు నిలువ నీడకోసం గుడిసెలు ఏర్పాటు చేసుకుంటే వారిపై జూలూం చేసి నానారాద్ధాంతం చేసే అధికార యంత్రాంగానికి ప్రభుత్వ భూములు ఆక్రమించి కోట్లు గడించే అక్రమార్కులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ భుములు ఆక్రమించుకుంటున్న వ్యక్తులకు పట్టాలు, రిజిస్ట్రేషన్లు ఎలా అవుతున్నాయో అధికారులే సమాదానం చెప్పాలన్నారు. సింగరేణి లీజు స్థలాలను సైతం కబ్జాదారులు వదలడం లేదని, దీనిపై సింగరేణి యాజమాన్యం ఎందుకు నోరుమెదపడం లేదన్నారు. ఇప్పటివరకు కబ్జాకు గురైన స్థలాలను అధికారులు స్వాదీనం చేసుకోవడంతోపాటు అక్రమార్కులపై కఠిణ చర్యలు తీసుకోవాలని, ఖాళీ స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించని పక్షంలో ప్రభుత్వ స్థిరాస్తులను తామే కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలు, రెవిన్యూ భూముల వివరాలపై శ్వేతప్రతం విడుదల చేయాలని సాబీర్ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, వై. శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్, జిల్లా నాయకులు మాచర్ల శ్రీనివాస్, నూనావత్ గోవిందు, లక్ష్మి నారాయణ, గోనె మణి, బోయిన విజయ్ కుమార్, పి.సత్యనారాయణచారి, అజీత్, గొనె సురేష్, బరిగెల భూపేష్ తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డెక్కిన అంగన్వాడీలు

మక్తల్ సెప్టెంబరు 26 (వాయిస్ టుడే): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 16 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు స్థానిక చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజ్, పుంజనూరు ఆంజనేయులు మరియు అంగన్వాడి ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన సిరిపురం నాగన్న

కరీంనగర్, సెప్టెంబర్ 26(వాయిస్ టుడే): రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల దృశ్య కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరిపురం నాగన్న కొత్తపెల్లి మండలంలోని పలు గ్రామాలలో గణపతి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిపురం నాగన్న మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల ప్రజలు ఎన్నో సమస్యలతో కూరుకుపోయారని, కెసిఆర్ అవినీతి పాలనకు చెరమగీతం పాడే సమయం ఆసన్నమైందని, ప్రజల పక్షాన పోరాడే కాంగ్రెస్ పార్టీ వెంట యావత్ తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని, ఎవ్వరు ఊహించని రాజకీయ పరిణామాలు త్వరలో తెలంగాణ ప్రజలు చూడబోతున్నారని తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం సాధించడం ఖాయమని, గంగులను గద్దె దింపడం జరిగి తీరుతుందని తెలిపారు. ఆ విగ్నేశుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో తమ జీవితాలు గడపాలని కోరారు. ఈ కార్యక్రమములో కొత్తపెల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భూస ప్రశాంత్, గడ్డిరాజు, భూస సంపత్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ భూస సందీప్, నూనెగొండ చందు, బుర్ర హరీష్ గౌడ్, గుండా శ్రీనివాస్, రాజ్ కోటి పాల్గొన్నారు.

## జమ్మికుంటలో సినీ హీరో సుమన్ సందడి

జమ్మికుంట (వాయిస్ టుడే): అమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్ లో మరో చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకొని పూర్తి చేసుకుంది .. మంగళ వారం రోజు ప్రముఖ హీరో సుమన్ తో లాస్ట్ షెడ్యూల్ దర్శకుడు జివిస్ గౌతంకృష్ణ చిత్రీకరించారు.ప్రముఖ ప్రొడ్యూసర్, నటులు, బత్తిని కీర్తి లత గౌడ్ సినిమాలో నటించారు.జమ్మికుంట లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో హీరో సుమన్ హాజరు అయ్యారు.సినిమా షెడ్యూల్ ని డాక్టర్ సురంజన్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. డాక్టర్ సురంజన్ మాట్లాడుతూ దళిత బంధు పథకంలో కెమెరాలు తీసుకొని సినిమా తీస్తున్న జివిస్ గౌతంకృష్ణ ను అభినందిచారు.నిర్మాత సతీష్ నిమ్మల మాట్లాడుతూ.మన ప్రాంతంలో చిత్రం షూటింగ్ పూర్తి చేశాం పస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్స్ లో ఉంది అన్నారు, సినిమాను డిసెంబర్ నెలలో విడుదల చేస్తాం అన్నారు.చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ కుమారుడు దీక్షిత్ ఇందులో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా క్రైం సస్పెన్స్ కథాంశంతో కూడుకున్నది అనీ నిర్మాత తెలిపాడు.